క్లుప్తంగా

ఉద్యోగులు సమయపాలన పాటించాలి

కారెంపూడి: మండలంలోని అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఉదయం 10 గంటలలోపు ఖచ్చితంగా విధులకు హాజరు కావాలని తహసీల్దార్ జి శ్రీనివాస్‌యాదవ్, ఎంపీడీఓ జి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పంచాయతీ కార్యాలయాల ఉద్యోగులు, వీఆర్వోల సమావేశాన్ని అధికారులు నిర్వహించారు. రోజువారి విధులను నిర్వర్తిస్తూనే ఇతర విధులను బాధ్యతలను కూడా సమన్వయం చేసుకోవాలని వారు ఆదేశించారు. అసలు క్రమ శిక్షణా చర్యలు అనే మాటకు ఆస్కారం లేకుండా అంతా విధులను శ్రద్ధతో నిర్వహించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. సమావేశంలో డీటీ కీర్తిసుధాస్రవంతి, ఈఓపీఆర్డీ సత్యప్రసాద్ పాల్గొన్నారు.

ఆంగ్ల భాషపై అవగాహన సదస్సు



కారెంపూడి: ఆంగ్ల భాష నేర్చుకునేందుకు అవసరమైన మెలకువలను వివరిస్తూ హైదరాబాద్‌కు చెందిన హమూస్ ఆంగ్ల అకాడమి స్థానిక ఏపీటీడబ్ల్యూఆర్ బాలుర పాఠశాలలో మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించడం ద్వారా భావవ్యక్తీకరణ సులభమౌతుందని అకాడమీ డైరెక్టర్ గంగవరపు హనుమంతరావు వివరించారు. ఒకాబులరీ గ్రామర్ సులభంగా నేర్చుకునే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. ఇంగ్లిష్‌పై పట్టు సాధిస్తే భవిష్యత్తులో ఉపాధి, ఉద్యోగవకాశాలు పొందడం సులువవుతుందన్నారు. అకాడమి రూపొందించిన విద్యార్థులకు ఉపయుక్తమైన పుస్తకాలను ప్రిన్సిపల్ పి వేణుగోపాలరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



రెంటచింతల: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని మార్కెట్ సబ్‌యార్డు వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. వినుకొండ నియోజకవర్గంలోని బొల్లాపల్లి మండలం రేమిడిచర్ల గ్రామానికి చెందిన బొజ్జ వెంకటరమణ(36) కుటుంబ సభ్యులు కలిసి మనవడు అఖిలేష్ పుట్టు వెంట్రుకలను రెంటచింతల మండలం జెట్టిపాలెం గ్రామంలో వేంచేసిన మైసమ్మ అమ్మవారి ఆలయంలో తీయాలని నిర్ణయించుకుని రేమిడిచర్ల నుంచి రెంటచింతలకు చేరుకున్నారు. జెట్టిపాలెం గ్రామానికి కుమారుడు అనీల్ ద్విచక్రవాహనం నడుపుతుండగా వెంకటరమణ వెనుక కూర్చుంది. ఈ నేపథ్యంలో స్థానిక మార్కెట్ సబ్‌యార్డు వద్ద గుర్తుతెలియని మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టగా వెనుక ఉన్న వెంకటరమణ కిందపడడంతో తలకు బలమైన గాయమైంది. వెంటనే ఆమెను పిడుగురాళ్ళ పట్టణంలోని ఓ కార్పొరేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి భర్త చిన గాలయ్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

చిలకలూరిపేట: జర్నలిస్టుల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. ఏపీయూడబ్ల్యూజే అనుబంధ చిలకలూరిపేట ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం పట్టణంలోని గ్రాండ్ వెంకటేష్ ఫంక్షన్‌హాలు లో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి విడదల రజిని మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం సానుకూల విధానాలను ప్రకటించిందని తెలిపారు. ఇప్పటికే చిలకలూరిపేట ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి స్థలం కేటాయింపు పూర్తయిందని, భవన నిర్మాణానికి సైతం తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. ఇండియన్ జర్నలిస్టు యూనియన్ స్టీరింగ్‌కమిటీ సభ్యులు అంబటి ఆంజనేయులు మాట్లాడారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా అన్నలదాసు శేషగిరిరావు, కార్యదర్శిగా షేక్ అబ్దుల్ సత్తార్, కోశాధికారిగా గాయాల వెంకట్ ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. జర్నలిస్టు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీసీ వర్గాల అభ్యున్నతే ప్రభుత్వం ధ్యేయం

నరసరావుపేట: రాష్ట్రంలో రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా బీసీల ఎదుగుదలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. బీసీ భవన్‌కోసం ప్రభుత్వం కలెక్టరేట్ ఎదురుగా రాజీవ్ స్వగృహ నిర్మాణాలకు వెనుకవైపున 15 సెంట్ల భూమిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేసిన 24గంటల వ్యవధిలోనే మంగళవారం ఆ స్థలంలో బీసీ భవన్ నిర్మాణానికి డీఆర్‌ఓ వినాయకం, పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్‌తో కలిసి టెంకాయ కొట్టి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ బీసీ భవన్ నిర్మాణానికి మున్సిపల్ నిధుల నుంచి రూ.50లక్షలను కేటాయిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

మహాత్మ జ్యోతిరావు పూలేకు ఘన నివాళి



పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాసు, వైఎస్సార్ సీపీ నాయకులు

పిడుగురాళ్ల: పట్టణంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మహనీయుల విగ్రహాలను త్వరలోనే ఏర్పాటు చేస్తామని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జ్యోతిరావుపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా మహాత్మ జ్యోతిరావు పూలే, దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కుందుర్తి గురవాచారి అధ్యక్షతన జ్యోతిరావుపూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్రం రాక ముందు బ్రిటిష్ పాలన రాక ముందు ఈ దేశంలో జన్మించి ఈ రోజు ఉన్న అనేక సమస్యలు కుల వివక్షత, వితంతవుల కష్టాలు, కనీసం ఆడవాళ్లు చదువుకోలేని తరుణంలో భారత దేశంలో మార్పు రావాలని, దేశంలో ఉన్నది ఒకేటి కులం అది మానవ జాతి, వృత్తిని, ప్రాంతాన్ని బట్టి కులం ఏర్పాటు చేసుకోవడం జరిగిందని ఆయన తెలియజేశారు. అసమానతలు తగ్గాలని చదువు ఒక్కటే మార్గం అని చాటి చెప్పిన వ్యక్తి జ్యోతిరావు పూలే అన్నారు. అలాంటి మహనీయులను స్మరించుకోవాల్సిన అవసరమై ఎంతైనా ఉందన్నారు. త్వరలోనే మహనీయుల విగ్రహాల ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. పూలే, మహాత్మగాంధి, ఏపీజే అబ్దుల్ కలాం లాంటి విగ్రహాలను కూడా ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ఈ నెల 14వ తేదీన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించబోతున్నామని ఆయన తెలియజేశారు. రాబోయే రోజుల్లో వారి యొక్క గొప్పతనం తెలిసేవిధంగా కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేయబోతున్నామని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, పట్టణ, మండల అధ్యక్షులు చింతా వెంకట రామారావు, చల్లా పిచ్చిరెడ్డి, కౌన్సిలర్లు అజ్మీర శారద, కాంద్రకుంట శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, పసుపులేటి ఆనంద్, కుక్కమూడి సుందరరావు, కత్తెరపు వాసుదేవరెడ్డి, ఉప్పు వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కందులూరి శివయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు కొమెర వెంకటేశ్వర్లు, నాగరాజు, దుర్గారావు, గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి, గొట్టిముక్కల పవన్‌రెడ్డి పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు,
కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల: పట్టణంలోని ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు జంగా వెంకట కోటయ్య, సునీతలు హాజరై జ్యోతిరావుపూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కట్టా వెంకటేశ్వరరెడ్డి, 14వ వార్డు కౌన్సిలర్ షేక్ షరీఫ్, మద్దాలి సుబ్బయ్య, ఏలూరి సైతారావు, వేమరం ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు నల్లబోతుల నరసింహారావు తదితరులు ఉన్నారు. అదేవిధంగా పట్టణంలోని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గుర్రం జాషువా విగ్రహం వద్ద మహాత్మ జ్యోతిరావుపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేగల అబ్రహం, వెంకట్రావు తదితరులు ఉన్నారు.

విజయపురిసౌత్: సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిబాపూలే 197వ జయంతిని స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీరాజ్యం మాట్లాడుతూ మహిళల విద్యాభివృద్ధికి అణగారిన వర్గాల అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన మహాత్మ జ్యోతిబాపూలేను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్య ద్వారానే సమాజాభివృద్ధి జరుగుతుందని ఆయన విశ్వసించేవారని తెలిపారు. కుల నిర్మూలనకు కృషి చేసిన ఆయన గొప్ప సంఘ సంస్కర్త, మానవతావాది అని కొనియాడారు. అనంతరం మహాత్మ జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ దారా మేరీ మంజుల, ఉపాధ్యాయినులు వాణిరాణి, సుజాత, చెంచులక్ష్మి, అన్నపూర్ణ, నాగమణి, హేమలత, సరళ, విద్యార్థినులు పాల్గొన్నారు.

మాచవరం: నాటి సమాజంలోని అసమానతలు, వివక్షపై నిరంతరం పోరాడిన సాంఘిక సంస్కరణోద్ధారకుడు, సామాజిక విప్లవ యోధుడు జ్యోతిరావు పూలే అని జెడ్పీటీసీ జె.శివాయాదవ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ బీసీ విభాగం ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కులు, బానిస విముక్తి, స్త్రీ విద్య, కుల నిర్మూలన ఉద్యమాలకు బీజం నాటి, వాటి సాధనకై ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకై ప్రతి ఒక్కరు పాటు పడాలన్నారు. పలువురు మాట్లాడుతూ ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ విభాగం మండల అధ్యక్షుడు జంగాల సురేష్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లచ్చిరెడ్డి, స్థానిక సర్పంచ్ రాగిడి నరేష్, ఎంపీటీసీ గురవయ్య, మండల యూత్ కన్వీనర్ మద్దు ప్రసాదు, వైఎస్సార్ సీపీ నాయకులు పుల్లారెడ్డి, జానీ, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లి : సాంఘీక దురాచారాలను అరికట్టి సమ సమాజ స్థాపన కోసం మహాత్మ జ్యోతిరావుపూలే పనిచేశారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. పల్నాడు బలహీనవర్గాల సమాఖ్య ఆధ్వర్యంలో పూలే జయంతిని నారాయణపురం ఆర్అండ్‌బీ బంగ్లా సెంటర్‌లో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ జంగా పూలే విగ్రహానికి పూలదండలు వేసి నివాళి అర్పించారు. కులరహిత సమాజ స్థాపన కోసం పూలే కృషి చేశారని ఎమ్మెల్సీ జంగా చెప్పారు. సమాజంలో ఎన్నో అవమానాలు, అవరోధాలను అధిగమించి విద్య ద్వారానే సమాజంలో మార్పు తీసుకురావచ్చునని పూలే భావించారని, బలహీనవర్గాలకు దూరమైన విద్యను దగ్గర చేర్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పూలే జయంతి వేడుకల్లో జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీడీఓ సాంబశివరావు పూలే చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంబటి శేషగిరిరావు, మాజీ జెడ్పీటీసీ భూషణం చెన్నయ్య, కౌన్సిలర్లు షేక్ షరీఫ్, సమాఖ్య అధ్యక్షుడు రాజు, నాయకులు గద్దల వేదమణి, ముశ్యం వెంకటేశ్వర్లు, బత్తుల వెంకయ్య, మాశెట్టి పుల్లారావు, బలుగూరి సీతారామయ్య, బండ్ల ఏసుపాదం, మందా శంకర్, జక్కుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పూలే విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి



పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీలు జంగా వెంకట కోటయ్య, సునీత



పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న విద్యుత్ ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణ

సూర్యతాపంతో విలవిల



జానపాడు రోడ్డులో జనం లేకుండా ఉన్న దృశ్యం

పిడుగురాళ్ల: సూర్యుడి తాపం తట్టుకోలేక ప్రజలు విలవిలలాడిపోతున్నారు. కాసింత నీడ దొరికితే చాటు అనుకుంటున్నారు. ఉదయానే 11 గంటల కల్లా అందరు పనులు ముగించుకుని ఇంటి దారి పడుతున్నారు. దీంతో పట్టణంలోని జానపాడు రోడ్డు, పిల్లుట్ల రోడ్డు, గుంటూరు, మాచర్ల రోడ్లు ఎప్పుడు జనంతో రద్దీగా ఉండే రోడ్లు నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. సూర్యుడి తాపం తగ్గిన తర్వాత సాయంత్రం 4 గంటల తర్వాత మరలా ఈ రోడ్లపైకి జనం వస్తున్నారు.

జీసస్ మాచర్ల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక

మాచర్ల: గుడ్ షెపర్డ్ చర్చిలో జరిగిన దైవ సేవకుల సదస్సు ఘనంగా జరిపారు. మంగళవారం సంఘ సేవకులు, కాపరి కుక్కమూడి దయానంద్ దైవ సేవకులను ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. అధ్యక్షుడిగా ఆలేటి రాబర్టు, నియోజక వర్గ కమిటీ సభ్యులు వేల్పుల దానియేలు, యోగిరాములు, ఆలేటి రాబర్టు, బత్తుల ప్రభాస్‌లు ఎన్నికై నట్లు తెలిపారు. అనంతరం ప్రార్ధన, ఆశీర్వాద ప్రార్ధన నడిపించారు. సువార్త గాయకులు ఆత్మీయ గీతములు ఆలపించి దేవుని స్తుతించి మహిమ పరిచారు. ముఖ్య ప్రసంగీకులు ఎన్‌సిహెచ్ బాలరాజు వాక్యోపదేశాన్ని అందించారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దాచేపల్లి : నడికుడి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు బుధవారం అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ అధికారులు మంగళవారం తెలిపారు. నడికుడి పిటిఆర్-2 ఓఎల్‌టీసీ మరమ్మతుల నేపథ్యంలో నడికుడి పారిశ్రామిక వాడ పరిధిలో విద్యుత్ సరఫరా ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉండదని వారు చెప్పారు.

సంక్షేమ ఫలాలు ఇంటికిచ్చే సీఎంను ఎన్నుకోవాలి



15వ వార్డులో జగనన్న కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కౌన్సిలర్, పార్టీ నేతలు



మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ



జగనన్నే మా భవిష్యత్ స్టే కార్డులతో ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, గృహ సారథులు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి



మా నకమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ రేవతి

ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

పిడుగురాళ్ల: సంక్షేమ ఫలాలు ఇంటికి వచ్చి అందించే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. పట్టణంలోని 15వ వార్డులో వార్డు ఇన్‌చార్జి ఆతుకూరి శ్రీధర్, వైఎస్సార్ సీపీ నాయకులు కొడూరి ప్రసాద్, 27వ వార్డులో కౌన్సిలర్ అన్నెం పద్మావతి ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగనన్న... మా భవిష్యత్ నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే తరాలకు మంచి భవిష్యత్ ఉండాలటే రాష్ట్ర ముఖ్యమంత్రిగా మరలా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉంటేనే సాధ్యమవుతుందన్నారు. అదే విధంగా పట్టణంలోని 17 సచివాలయ పరిధిలో, 33వ వార్డు పరిధిలోని కౌన్సిలర్ల ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెంటచింతల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను గృహ సారథులు అర్హులైన ప్రజలకు అందిస్తూ వారికి అండగా ఉంటూ వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. మంగళవారం రెంటచింతలలోని ఆంజనేయస్వామి మాన్యం కాలనీలో గృహ సారథులకు, సచివాలయ కన్వీనర్లకు, గ్రామ వలంటీర్లతో కలిసి ఇంటింటికి తిరుగుతూ మాట్లాడారు. ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు గృహ సారథులు జగనన్నే మా భవిష్యత్...మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి మన ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు పలు సంక్షేమ పథకాల వల్ల ఎంత లబ్ధి చేకూరిందో వివరించామన్నారు. గ్రామాల్లో గృహసారథులు, కన్వీనర్లు అంకిత భావంతో కృషిచేస్తూ వైఎస్సార్ సీపీ అంటే ప్రజల పార్టీగా నమ్మకం కలిగించాలన్నారు. కార్యక్రమంలో గృహ సారథులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కారెంపూడి: జగనన్నే మా భవిష్యత్..మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంపై మండలంలోని పేట సన్నెగండ్ల గ్రామంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు కార్యక్రమ నిర్వహణపై ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, గ్రామానికి చెందిన మండల పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ అల్లు వెంకటేశ్వరరెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమ నిర్వహణకు అవసరమైన మెటీరియల్‌ను పంపిణీ చేశారు. అనంతరం మంగళవారం సాయంత్రం నుంచి గ్రామంలో కార్యక్రమాన్ని నిర్వహించే విధంగా ప్రణాళిక సిద్ధం చేశారు. గ్రామ సచివాలయ కన్వీనర్ టీమ్ ప్రతి రోజూ 50 గడపలకు వెళ్లి వారికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను గుర్తు చేస్తూ గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇంత పెద్ద ఎత్తున సంక్షేమాన్ని అమలు చేయలేదని, భవిష్యత్తులో కూడా ఇవి కొనసాగాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు తెలపాలని ప్రజలను కోరాలని, అలాగే ప్రజల స్పందనను తెలుసుకుని వారు చెప్పే సమస్యలు కూడా నోట్ చేసుకోవాలని నాయకులు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఉన్నం ఆదిశేషగిరిరావు, ఎంపీటీసీలు కొంగర సుబ్రమణ్యంఇందిరాదేవి, గాడిపర్తి రమాదేవి పూర్ణయ్య, వెన్నపూసల బుల్లెబ్బాయి, మాచర్ల ఏడుకొండలు, మామిడి శేఖర్, అన్నారావు తదితరులు పాల్గొన్నారు.

కారెంపూడి: మండలంలోని నరమాలపాడు గ్రామంలో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం మంగళవారం రాత్రి కొనసాగింది. మాజీ ఎంపీటీసీ యాకసిరి తిరుపతిరావు, కిరణ్‌కుమార్, మల్లేశ్వరరావు, జి మరియదాసు, రాంబాబు, వలంటీర్ దారివేముల రోశయ్య తదితరులు క్లస్టర్ 11లో ప్రతి గడపకు తిరిగి ప్రభుత్వ పని తీరును వారికి వివరించి ప్రజల మద్దతు కోరారు. గ్రామస్తులు కూడా ప్రభుత్వం పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో కూడా జగనన్నకు మద్దతుగా ఉంటామని భరోసా ఇచ్చారు.

దాచేపల్లి : మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని 13వ వార్డులో జరిగిన ఈ కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ దేవళ్ల రేవతి, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య, కౌన్సిలర్లు దేవళ్ల ప్రసన్నలక్ష్మీ పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి జగనన్న ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరు..పథకాల ద్వారా జరిగిన లబ్ది గురించి ప్రజలతో మాట్లాడారు. జగనన్న ప్రభుత్వం పని తీరు అద్భుతంగా ఉందని ప్రజలు చెప్పారు. నగర పంచాయతీతో పాటుగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు నిర్వహిస్తున్నారు.

దాచేపల్లి : జగనే ప్రజలకు ధైర్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. నారాయణపురం ఆర్అండ్‌బీ బంగ్లాలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రతిపక్ష పార్టీలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని, తాము అధికారంలోకి వస్తే ఈ పథకాలు రద్దు చేస్తామని చెప్పి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఎమ్మెల్సీ జంగా చెప్పారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకు వెళ్లితే ప్రతిపక్ష పార్టీలు చేసే దుష్ప్రచారాలు చెబుతు ఆవేదన చెందుతున్నారని, ఈ పథకాలన్ని మళ్లీ అమలు జరగాలంటే సీఎంగా జగనే ఉండాలనే సంకల్పాన్ని ప్రజల నుంచి వస్తోందని ఆయన తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా ప్రజల జీవితాలు వెలుగు బాటలో పయనిస్తున్నాయని, ఈ పథకాల వల్ల జీవితాలను మార్చేయనే భావనలో ప్రజలంతా ఉన్నారని ఎమ్మెల్సీ జంగా పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ అంబటి శేషగిరిరావు, మాజీ జెడ్పీటీసీ భూషణం చెన్నయ్య, మాజీ సర్పంచ్ మాశెట్టి పుల్లారావు, నాయకులు గద్దల వేదమణి, ముశ్యం వెంకటేశ్వర్లు, బత్తుల వెంకయ్య, జక్కుల రమేష్ తదితరులున్నారు.

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల

నాదెండ్ల: గణపవరం గ్రామంలో కొలువైయున్న గ్రామ దేవత పోలేరమ్మ తల్లి దేవాలయ వార్షిక తిరునాళ్ల మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. మధ్యాహ్నం గ్రామోత్సవం నిర్వహించారు.

ప్రత్యేక పూజల్లో మంత్రి రజిని...

పోలేరమ్మ తిరునాళ్ల సందర్భంగా అమ్మవారిని రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మంత్రి రజినిని కమిటీ సభ్యులు, వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శివాలయం ధర్మకర్త కెల్లంపల్లి వెంకటేశ్వరరావు అమ్మవారి చీరను బహూకరించారు. చిలకలూరిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, గణపవరం సొసైటీ చైర్మన్ కాట్రు రమేష్, లిఫ్ట్ కమిటీ చైర్మన్ బొప్పూడి రామారావు, నాయకులు విడదల గోపి తదితరులు పాల్గొన్నారు.

తిరునాళ్లకు పలు స్వచ్ఛంద సంఘాల సేవలు



పులిహోర పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సేవ సంఘం నిర్వాహకులు

మాచర్ల : లక్ష్మీచెన్నకేశవస్వామి తిరునాళ్లను పురస్కరించుకుని రథోత్సవం సందర్భంగా మంగళవారం వివిధ స్వచ్ఛంద సంస్థలు, ఆయా సంస్థల వారు మజ్జిగ, పులిహోర, పెరుగన్నం, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచే కూరగాయల మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో అసోసియేషన్ నాయకులు అన్నదానాన్ని 4వేల మందికి పైగా నిర్వహించారు.
అదే విధంగా పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆర్అండ్‌బి బంగ్లా ఎదురు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. శ్రీ వాసవి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పెరుగన్నం పంపిణీ చేశారు. వైఎస్సార్ చలివేంద్రాన్ని ప్రభుత్వ విప్ పిఆర్కే, పివిఆర్‌ల ఆధ్వర్యంలో మజ్జిగ, మంచినీరు వేలాది మందికి పంపిణీ చేశారు. కార్పెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పులిహోర, పెరుగన్నం, మజ్జిగ పంపిణీ కార్యక్రమాలన్ని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ తురకా కిషోర్, వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావులు ప్రారంభించారు. జ్యూయలర్స్ అసోసియేషన్, సత్యసాయి, శ్రీ మాతా అన్నపూర్ణేశ్వరి, ఎస్‌బిఐ ఆధ్వర్యంలో పలు ప్రాంతాలలో మంచినీరు, మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వచ్ఛంద సంస్థలు భక్తుల సేవలో పాల్గొన్నారు.

26 నుంచి మహిళా కోలాట ప్రదర్శన పోటీలు



మాట్లాడుతున్న శుభోదయ యువజన సంఘం అధ్యక్షుడు గాదె జయభారత్‌రెడ్డి

రెంటచింతల: రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో మహిళా కోలాట ప్రదర్శన పోటీలను ఈ నెల 26 నుంచి 27వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు శుభోదయ యువజన సంఘం అధ్యక్షుడు గాదె జయభారత్‌రెడ్డి అన్నారు. మంగళవారం రెంటచింతలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట మండలం మఠంపల్లి గ్రామంలో 25వ తేదీన జరిగే శుభవార్త దేవాలయ తిరుణాళ్ళ సందర్భంగా ఈ నెల 26 నుంచి 27 వరకు శుభవార్త దేవాలయం ఆవరణలలో ఈ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ.40 వేలు, ద్వితీయ బహుమతి రూ.35 వేలు, తృతీయ బహుమతి రూ.30 వేలు, నాల్గువ బహుమతి రూ.25 వేలు, ఐదవ బహుమతి రూ.20 వేలు, 6వ బహుమతి రూ.15 వేలు, 7వ బహుమతి రూ.10 వేలు, 8వ బహుమతి రూ.8 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. 28న స్థానిక మాంట్‌ఫోర్టు స్కూల్ ఆవరణలో నిర్వహించనున్న పాట్టేళ్ళ పోటీలలోని విజేతలైన వారికి రూ.30 వేలు. రూ. 20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలు చొప్పున వరుసగా బహుమతులను అందజేయడం జరుగుతుందన్నారు. పోటీల్లో పాల్గొనాలనే ఆశక్తి కలిగినవారు ఈ నెల 25వ తేదీ లోపు తమ పేరు నమోదు చేసుకుని ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించాలన్నారు. పోటీల్లో పాల్గొనే వారికి ఉచిత భోజన వసతి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మరిన్ని వివరాల కోసం 9618764924, 9848984603, 9182568951 సెల్‌నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

మట్టి పరీక్ష - శిక్షణపై వర్క్‌షాప్

నరసరావుపేటరూరల్: జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో మట్టినమూనాలు సేకరించి అందుకు అనుగుణంగా ఎరువుల వాడకం పై రైతులకు అవగాహన పెంచాలని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి చెప్పారు. పట్టణంలోని రోటరీక్లబ్‌లో పల్నాడు జిల్లాలోని వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారులకు, వ్యవసాయసహాయ సహాయకులకు మట్టి పరీక్ష-శిక్షణా వారం కార్యక్రమం లో భాగంగా జిల్లా స్థాయి వర్క్‌షాప్ మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐ.మురళి మాట్లాడుతూ భూసార పరీక్షల వలన రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. వాటిపై గ్రామస్థాయిలో అవగాహన పెంచాలని సూచించారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

గురజాల : పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ బి అనంత కృష్ణ తెలిపారు. కారంపూడిలో పేకాటాడుతున్నట్లు సమాచారం రావడంతో మంగళవారం రాత్రి ఎస్ఐ దాడి చేశారు ఈ దాడిలో 8 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.25,980లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.